పథకాలకు అర్హులను గుర్తించడమే లక్ష్యం

- వికసిత్ భారత్ సంకల్ప యాత్ర ముఖ్య ఉద్దేశం
- నోడల్ అధికారి, కేంద్ర ఉన్నత విద్య డిప్యూటీ సెక్రటరీ ప్రియాంక చతుర్వేది
- ఐ. పంగిడిలో రథయాత్ర



ఐ.పంగిడిలో కూరగాయలతో వేసిన ముగ్గును తిలకిస్తున్న నోడల్ అధికారి ప్రియాంక చతుర్వేది

కొవ్వూరు: అర్హత ఉండి కూడా పథకాల ద్వారా లబ్ధి పొందని వారిని గుర్తించడం వికసిత్ భారత్ సంకల్ప యాత్ర ముఖ్య ఉద్దేశమని నోడల్ అధికారి, కేంద్ర ఉన్నత విద్య డిప్యూటీ సెక్రటరీ ప్రియాంక చతుర్వేది అన్నారు. మండలంలోని ఐ.పంగిడి గ్రామంలో గురువారం నిర్వహించిన వికసిత్ భారత్ సంకల్ప యాత్రలో ఆయన పాల్గొన్నారు. గ్రామంలోని పాఠశాల విద్యార్థులకు ప్రభుత్వ పథకాలపై అవగాహన కల్పించాలని అధికార యంత్రాంగానికి సూచించారు. జిల్లా వ్యాప్తంగా 512 గ్రామ సచివాలయాల పరిధిలో ప్రచార రథం ద్వారా నవంబర్ 25 నుంచి జనవరి 26 వరకు ప్రజలకు అవగాహన కల్పిస్తున్నామన్నారు. అలాగే అర్హులకు సంక్షేమ పథకాలను అందజేస్తున్నామన్నారు. కేంద్ర ప్రభుత్వం వివిధ వర్గాల సంక్షేమం కోసం ఎన్నో పథకాలను అమలు చేస్తోందని చెప్పారు. వాటి ద్వారా ఎంత మందికి లబ్ధి చేకూరిందో, ఇంకా ఎంత మంది అర్హులు ఉన్నారో తెలుసుకోవడం తమ ఉద్దేశమన్నారు. మారుమూల గ్రామాల వారికి కేంద్ర ప్రభుత్వ పథకాల లబ్ధి చేకూర్చేలా ప్రతి ఉద్యోగి కృషి చేయాలని కోరారు. లబ్ధిదారుల నుంచి అందిన ఆర్జీలను స్వీకరించారు. ప్రచార వాహనం ద్వారా సచివాలయం పరిధిలో పర్యటించి కేంద్ర పథకాలపై అవగాహన కల్పించామన్నారు.ఈ యాత్రలో లబ్ధిదారులు, మహిళలు, విద్యార్థుల భాగస్వామ్యం కీలకం అన్నారు. పట్టణాల్లోనూ, గ్రామాల్లోను కేంద్ర పథకాలపై విస్తృత ప్రచారం నిర్వహిస్తున్నామన్నారు. జనధన్, పారిశ్రామిక, ఉజ్వల్, హౌసింగ్ పథకాల లబ్ధిదారులతో ప్రియాంక చతుర్వేది మాట్లాడారు. ప్రకృతి వ్యవసాయం ద్వారా పండించిన కూరగాయలు, ఆకుకూరలు, పండ్లతో ఐ.పంగిడిలో ఏర్పాటు చేసిన స్టాల్స్‌ను ఆయన సందర్శించారు. పలువురు రైతులతో ఆయన ముఖాముఖీ మాట్లాడారు. కూరగాయాలతో రూపొందించిన ముగ్గు ప్రదర్శన ఆకట్టుకుంది. జిల్లా వ్యవసాయ అధికారి ఎస్.మాధవరావు, డ్వామా పీడీ పి.జగదాంబ, డీఆర్‌డీఏ పీడీ ఎన్‌వీవీఎస్ మూర్తి, డీఎల్‌డీవో వి.శాంతమణి, ఎంపీడీవో కె.సుశీల, ఏడీఏ చంద్రశేఖర్, ఉద్యాన శాఖ హెచ్‌వో శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

పైప్‌లైన్ విస్తరణ పనులకు శ్రీకారం



తాళ్లపూడిలో తాగునీటి పైప్‌లైన్ పనులు ప్రారంభిస్తున్న దృశ్యం

తాళ్లపూడి: మండలంలోని అన్ని గ్రామాల ప్రజల దాహార్తి తీర్చే బృహత్తర తాగునీటి పథకం తాళ్లపూడి కేంద్రంగా పనిచేస్తున్న విషయం తెలిసిందే. ఈ పథకం నుంచి తాళ్లపూడి-1 సచివాలయం పరిధిలోని పాత వాటి స్థానే కొత్త పైప్‌లైన్ల నిర్మాణానికి, అవసరమైన వారికి ఉచిత కుళాయి కనెక్షన్ ఇచ్చేందుకు కేంద్ర ప్రభుత్వ నుంచి జల్‌జీవన్ మిషన్ ద్వారా రూ.22.5 లక్షల మంజూరయ్యాయని ఆ పంచాయతీ కార్యదర్శి ఆశా ఆలేఖ్య గురువారం తెలిపారు. ఈ సచివాలయం పరిధిలో చేపటీపైప్‌లైన్ విస్తరణ పనులను గురువారం ప్రారంభించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు నక్కా చిట్టిబాబు, సిద్ధంశెట్టి కృష్ణ, పార్టీ తాళ్లపూడి శాఖ అధ్యక్షుడు మైగాపుల ఆంజనేయులు, ఉప సర్పంచ్ అప్పన జగదీష్, వైస్ ఎంపీపీ కోదాటి కనకయ్య తదితరులు పాల్గొన్నారు.

కొవ్వూరు పట్టణ ఎస్సైగా సత్యనారాయణ



కొవ్వూరు: పట్టణ ఎస్సైగా జీవీవీ సత్యనారాయణ గురువారం బాధ్యతలు స్వీకరించారు. రాజమహేంద్రవరం టూ టౌన్ ఎస్సైగా పనిచేస్తున్న ఆయన బదిలీపై కొవ్వూరు వచ్చారు. 2009 బ్యాచ్‌కు చెందిన ఆయన గతంలో కాకినాడ టూటౌన్, రంపచోడవరం, ఏలూరు సీసీఎస్, ఎస్ఈబీ ఎస్సైగా విధులు నిర్వహించారు. గతంలో ఇక్కడ పనిచేసిన ఎస్సై దొమ్మేరు ఘటనలో సస్పెండ్ కావడంతో కొంత కాలంగా ఆ పోస్టు ఖాళీగా ఉంది.

సచివాలయంలో హెల్త్ టాస్క్‌ఫోర్స్ తనిఖీలు

తాళ్లపూడి: వైద్య,ఆరోగ్య శాఖ టాస్క్‌ఫోర్స్ బృందం గురువారం వేగేశ్వరపురం సచివాలయం - 2లో తనిఖీలు నిర్వహించింది. డాక్టర్ అభిషేక్ రెడ్డి సారథ్యంలో జిల్లా గణాంకాధికారి కుమార్‌స్వామి, డీపీహెచ్‌ఎంవో వసంతలక్ష్మి, డీపీవో సంధ్యారెడ్డి, డేటా మేనేజర్ రామకృష్ణలతో కూడిన బృందం ఈ సచివాలయం పరిధిలోని గర్భిణులు, పిల్లలకు వేసిన టీకాల వివరాల రికార్డులను పరిశీలించారు. 19 ఏళ్ళలోపు పిల్లలకు హెచ్‌బీ పరీక్షలు నిర్వహించి పాత రికార్డులతో సరిపోల్చి చూశారు. ఈ సచివాలయం పరిధిలో వైద్య సేవలు ఏవిధంగా అందుతున్నాయనే వివరాలను సేకరించారు. కార్యక్రమంలో తాళ్లపూడి పీహెచ్‌సీ వైద్యాధికారి నిశాంత్, డాక్టర్ హారికా గుప్త, సీహెచ్‌వో ఎం.వెంకటేశ్వరరావు, సిబ్బంది పాల్గొన్నారు.

సాగిపాడులో నేత్ర వైద్య శిబిరం

గోపాలపురం: కేజీ ఫౌండేషన్ చైర్మన్ డాక్టర్ కె.రాబిన్ పాల్ ఆధ్వర్యంలో గురువారం మండలంలోని సాగిపాడు గ్రామంలోని లెప్రసీ కాలనీలో ఉచిత నేత్ర వైద్య శిబిరం నిర్వహించారు. కార్యక్రమానికి క్రిస్టియన్ మైనార్టీ ఫైనాన్సియల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ బొల్లవరపు జాన్‌వెస్లీ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా అక్కడి పేదలకు ఉచిత కంటి పరీక్షలు నిర్వహించారు. అవసరమైన వారికి కళ్లజోళ్లు అందజేశారు. లెప్రసీ రోగులకు దుప్పట్లు పంపిణీ చేసారు. డి. గంగాధర్, పాస్టర్లు పాల్గొన్నారు.

క్రిస్మస్ వేడుకల్లో జాన్ వెస్లీ

కొవ్వూరు: వాడపల్లి గ్రామంలోని బైబిల్ మిషన్ సంపూర్ణ ప్రార్థనా మందిరంలో బుధవారం రాత్రి క్రిస్మస్ వేడుకలు నిర్వహించారు. ఈ వేడుకలకు హాజరైన ఏపీ క్రిస్టియన్, మైనారిటీ కార్పొరేషన్ చైర్మన్ బొల్లవరపు జాన్ వెస్లీ కేక్ కట్ చేసి దైవ జనులకు క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు. స్థానిక దైవజనులు బల్ల క్రిస్టియన్ పాల్ ఆధ్వర్యంలో ఈ క్రిస్మస్ వేడుకలు నిర్వహించారు. ఏసుక్రీస్తు సందేశాలను, సంకీర్తనలను ఆలపించారు. కొవ్వొత్తులు వెలిగించి క్రీస్తు గీతాలను ఆలపించారు. ఏపీ పాస్టర్స్ ఫెలోషిప్ కొవ్వూరు రీజినల్ చైర్మన్ కె.జోసెఫ్, దైవజనులు పాల్గొన్నారు.

వారి మాటలు నమ్మొద్దు.. సంక్షేమానికి పట్టం కట్టండి

- నిడదవోలు ఎమ్మెల్యే శ్రీనివాస్‌నాయుడు
- పెరవలిలో మూడో రోజు గడప గడపకూ..



పెరవలిలో ఓ కుటుంబానికి సంక్షేమ పథకాలు వివరిస్తున్న ఎమ్మెల్యే శ్రీనివాస్ నాయుడు

పెరవలి: ఎన్నికలు సమీపిస్తున్న వేళ ఇంటింటికీ వచ్చి కల్లబొల్లి హామీలు ఇచ్చే విపక్ష నాయకుల మాటలు నమ్మవద్దని, ఇచ్చిన హామీలను నూరు శాతం నెరవేర్చే వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వానికి మరోసారి అండగా నిలవాలని నిడదవోలు ఎమ్మెల్యే జి.శ్రీనివాస్‌నాయుడు కోరారు. మండల కేంద్రమైన పెరవలి పంచాయతీ పరిధిలో మూడో రోజు గురువారం కూడా గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం ఉత్సాహంగా సాగింది. ప్రజాప్రతినిధులు, వైఎస్సార్ సీపీ శ్రేణులతో కలసి ఎమ్మెల్యే పంచాయతీ కార్యాలయం వద్ద నుంచి కార్యక్రమాన్ని ప్రారంభించారు.గ్రామంలోని బీసీ, ఓసీ, ఎస్సీ నివాసిత ప్రాంతాల్లో ఇంటింటికీ వెళ్లారు. ఈ మూడు ప్రాంతాల్లోని మొత్తం 453 గృహాల సందర్శించి, ప్రజలను ఆప్యాయంగా పలకరించారు. సంక్షేమ పథకాలు సక్రమంగా అందుతున్నాయా? లేదా? అని వారిని అడిగి తెలుసుకున్నారు. మీ ప్రాంతంలో సమస్యలు ఏమైనా ఉన్నాయా? అని వారిని ప్రశ్నించారు. తమ ప్రాంతంలో డ్రెయిన్ నిర్మించాలని స్థానికులు ఎమ్మెల్యే శ్రీనివాస్ నాయుడిని కోరారు. త్వరలోనే వాటి నిర్మాణాలు చేపడతామని ఆయన వారికి హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ పంచాయతీ పరిధిలో సంక్షేమం, అభివృద్ధికి జగన్ ప్రభుత్వం రూ.70 కోట్లు ఖర్చు చేసిందన్నారు. ఈ గ్రామంలోని 198 మంది పేదలకు ఇళ్ల పట్టాలు ఇచ్చామని ఎమ్మెల్యే గుర్తు చేశారు. గత తెలుగుదేశం ప్రభుత్వం ఐదేళ్ల పాలనలో ఎంతమందికి ఇళ్ల స్థలాలు ఇచ్చారని ఆయన ప్రశ్నించారు. కార్యక్రమంలో ఎంపీపీ కార్చెర్ల ప్రసాద్, వైఎస్సార్ సీపీ మండల శాఖ అధ్యక్షుడు వీరమళ్ల సత్యనారాయణ, గ్రామ శాఖ అధ్యక్షుడు పంపన అంజి, జెడ్పీటీసీ సభ్యురాలు కొమ్మిశెట్టి రామాంజని, పార్టీ ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు పొట్టి రాంబాబు, , దొడ్డిగర్ల స్వాతి, పంచాయతీ సర్పంచ్ గంగోలు సీతమ్మ తదితరులు పాల్గొన్నారు.

స్వామి వారి క్యాలెండర్ ఆవిష్కరణ



వేంకటేశ్వరస్వామి వారి క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే శ్రీనివాస్ నాయుడు

పెరవలి: మండలంలోని అన్నవరప్పాడు వేంకటేశ్వర స్వామి వారి 2024 సంవత్సరపు క్యాలెండర్‌ను నిడదవోలు ఎమ్మెల్యే జి.శ్రీనివాస్ నాయుడు ఆవిష్కరించారు. అన్నవరప్పాడు గ్రామంలో, ఆ పంచాయతీ సర్పంచ్ పంతం బాల సరస్వతి ఇంటి వద్ద గురువారం ఈ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ అన్నవరప్పాడు వేంకటేశ్వరస్వామి వారి ఆలయానికి వస్తే, తిరుమల స్వామి వారి ఆలయంలో ఉన్న అనుభూతి కలుగుతుందన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల శాఖ అధ్యక్షుడు వీరమళ్ల సత్యనారాయణ, ఆ పార్టీ గ్రామ నాయకుడు పంతం సత్యనారాయణ (చిన్న) సొసైటీ అధ్యక్షుడు పంత నాగేశ్వరరావు, ఆలయ ఈఓ మీసాల రాధాకృష్ణ, అర్చకులు పాల్గొన్నారు.

పొగాకుకు నాణ్యమైన విద్యుత్తు ఇవ్వాలి

ఎమ్మెల్యే తలారిని కలసిన రైతుల వినతి



దేవరపల్లిలో ఎమ్మెల్యే తలారి వెంకట్రావుకు వినతిపత్రం ఇస్తున్న పొగాకు రైతులు

దేవరపల్లి: ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలోని మెట్ట ప్రాంతంలో పొగాకు సాగు ఉన్నందున వ్యవసాయ రంగానికి తొమ్మిది గంటల పాటు నిరాటంకంగా విద్యుత్తు సరఫరా చేయాలని గోపాలపురం ఎమ్మెల్యే తలారి వెంకట్రావును పొగాకు రైతులు కోరారు. గురువారం దేవరపల్లిలోని క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యేను పొగాకు రైతులు కలిసి సాగులో తాము ఎదుర్కొంటున్న సమస్యలను వివరించారు. పొగాకు తోటలకు నీటి తడులు ఎక్కువగా ఇవ్వవలసి ఉన్నందున కోతలు లేకుండా విద్యుత్తు సరఫరాకు చర్యలు తీసుకోవాలని కోరారు. ఉదయం రెండు గంటలు సరఫరా నిలుపుదల చేయడం వల్ల ఇబ్బంది పడుతున్నట్టు రైతులు తెలిపారు. అవసరమైతే మధ్యాహ్నం 1 గంట నుంచి 2 గంటల మధ్యలో సరఫరా నిలుపుదల చేయాలని కోరారు. తుపాను వల్ల పొగాకు తోటలు దెబ్బతిని తీవ్రంగా నష్టపోయినందున బ్యాంకుల ద్వారా అదనపు రుణ సదుపాయం కల్పించి రైతులను ఆదుకోవాలని రైతులు ఎమ్మెల్యే తలారి వెంకట్రావును కోరారు. రైతుల సమస్యలపై స్పందించిన ఎమ్మెల్యే తలారి వెంకట్రావు విద్యుత్ శాఖ అధికారులతో మాట్లాడారు. వ్యవసాయ రంగానికి తొమ్మిది గంటలు నిరాటంకంగా నాణ్యమైన విద్యుత్ సరఫరా చేయాలని ఆదేశించారు. లీడ్ బ్యాంకు మేనేజరుతో మాట్లాడి, రైతులకు అధనంగా రుణాలు ఇచ్చి ఆదుకోవాలని కోరారు. కార్యక్రమంలో పొగాకు కేంద్రం రైతు సంఘం అధ్యక్షులు కరుటూరి వెంకటశ్రీనివాసరావు, సింహాద్రి ధర్మావతారు, పలువురు రైతులు పాల్గొన్నారు.

రూ. 1.99 కోట్ల అభివృద్ధి పనులకు ఆమోదం

- గడప గడపకూ పనులకు రూ.80 లక్షలు
- మున్సిపల్ సాధారణ, అత్యవసర సమావేశాలు





సమావేశానికి హాజరైన సభ్యులు. (అంతరచిత్రం) మాట్లాడుతున్న చైర్మన్ భూపతి ఆదినారాయణ

నిడదవోలు: మున్సిపాలిటీ పరిధిలో రూ.1.99 కోట్ల వ్యయంతో చేపట్టే 29 ముఖ్యమైన పనులకు మున్సిపల్ కౌన్సిల్ ఏకగ్రీవంగా ఆమోదం తెలిపింది. మున్సిపల్ కౌన్సిల్ సాధారణ, అత్యవసర సమావేశాలు గురువారం చైర్మన్ భూపతి ఆదినారాయణ అధ్యక్షతన జరిగాయి. సాధారణ సమావేశంలో అజెండాలో ప్రతిపాదించిన ఏడు అంశాలకు, అత్యవసర సమావేశంలో ప్రతిపాదించిన 23 అంశాలను కౌన్సిల్ ఆమోదించింది. మున్సిపల్ చైర్మన్ ఆదినారాయణ మాట్లాడుతూ స్థానిక గణపతి జంక్షన్ విస్తరణ పనుల్లో భాగంగా చేపట్టిన ఆక్రమణల తొలగింపునకు సహకరించిన అన్ని రాజకీయ పార్టీలకు కృతజ్ఞతలు తెలిపారు. జనవరి 10 నాటికి ఈ జంక్షన్ అభివృద్ధి పనులు పూర్తవుతాయన్నారు. ఎమ్మెల్యే జి.శ్రీనివాస్‌నాయుడు గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో పట్టణంలోని నాలుగు సచివాలయాల పరిధిలో గుర్తించిన 8 పనులకు ప్రభుత్వం రూ.80 లక్షలు మంజూరు చేసిందన్నారు. ఈ నిధులతో సీసీ రోడ్లు, డ్రైన్ల నిర్మాణాలు చేపడుతున్నామన్నారు.

కౌన్సిల్ ఆమోదించిన ప్రధానాంశాలు

పాటిమీద సెంటర్ నుంచి గణపతి సెంటర్ వరకూ కొత్తగా నిర్మించిన ఎల్‌ఎంహెచ్ మార్గంలో అవసరమైన చోటల్లా త్రీడీ ఆర్ట్ పెయింటింగ్ వేసేందుకు కౌన్సిల్ రూ.11 లక్షలు కేటాయించింది. 22 వార్డు వైఎస్సార్ కాలనీలో సీసీ రోడ్డు, డ్రైన్ నిర్మాణానికి రూ.5 లక్షలు కేటాయించారు.పట్టణంలో ఆక్రమణల తొలగింపునకు రూ.3.36 లక్షలు, 27వ వార్డులో డ్రైనేజీల మరమ్మతులకు రూ.5.80 లక్షలు కేటాయించారు. అలాగే ఆరో వార్డులో సీసీ రోడ్డు నిర్మాణానికి రూ.6.62 లక్షలు, వీధిదీపాల నిర్వహణకు రూ.4.23 లక్షలు, గణపతి సెంటర్ వద్ద విద్యుత్తు ట్రాన్స్‌ఫార్మర్లు మార్పునకు ట్రాన్స్‌కోకు చెల్లించేందుకురూ. 42 లక్షలు కేటాయించారు. సమావేశంలో మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్లు గంగుల వెంకటలక్ష్మి, యలగాడ బాలరాజు, కమిషనర్ కేవీ పద్మావతి, పట్టణ ప్రణాళిక అధికారి సుప్రియ, ఇతర విభాగాల అధికారులు పాల్గొన్నారు.

గ్యాస్ సిలిండర్ లీకై తాటాకిల్లు దగ్ధం

దేవరపల్లి: సంగాయగూడెంలో గురువారం సంభవించిన అగ్ని ప్రమాదంలో తొర్లపాటి రాజుకు చెందిన తాటాకిల్లు పూర్తిగా దగ్ధమైంది. గ్యాస్ లీకై ఈ ప్రమాదం జరిగినట్టు బాధితుడు తెలిపారు. ప్రమాదంలో టీవీ, విలువైన సామాన్లు, వంట పాత్రలు, దుస్తులు పూర్తిగా బూడిదయ్యాయి. ఆర్ఐ డి. వెంకటేష్ ప్రమాద స్థలాన్ని పరిశీలించి నష్టం విలువ రూ.1.50 లక్షలు ఉంటుందని అంచనావేశారు. ప్రభుత్వం నుంచి బాధిత కుటుంబానికి తక్షణ సాయంగా 25 కిలోల బియ్యం అందజేశారు. బాధిత కుటుంబానికి ఎంపీటీసీ సుంకవల్లి చినవెంకటరమణ, వైఎస్సార్ సీపీ గ్రామ కమిటీ అధ్యక్షుడు సుంకవల్లి శ్రీనివాస్ రాజు కుటుంబ సభ్యులను పరామర్శించి రూ.1000 ఆర్థిక సాయం అందజేశారు. జనసేన నియోజకవర్గ కన్వీనర్ డి. సుర్జరాజు, సర్పంచ్ కరుటూరి ఉషారాణి, శ్రీనివాస్ బాధిత కటుంబ సభ్యులను పరామర్శించి రూ.12 వేల ఆర్థికసాయం అందజేశారు.

పొగాకు తోటలు పరిశీలించిన అధికారులు

గోపాలపురం: ఇటీవల సంభవించిన మిచాంగ్ తుపానుకు దెబ్బతిన్న మండలంలోని పొగాకు తోటలను సీటీఆర్ఐ, పొగాకు బోర్డు అధికారులు గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా రాజమహేంద్రవరం పొగాకు బోర్డు రీజినల్ మేనేజర్ ఎం.ఆదిశేషయ్య మాట్లాడుతూ తుపాను నుంచి బయట పడిన తోటలకు సస్యరక్షణ చర్యలు చేపట్టాలని రైతులకు సూచించారు. పొగాకు క్యూరింగ్, తెగుళ్ల నివారణకు వాడాల్సిన మందులను సిఫారసు చేశారు. ఈయన వెంట సీటీఆర్ఐ శాస్త్రవేత్తలు ఐ.సుబ్బయ్య, రఘురామ ప్రసాద్, కె శ్రీధర్‌రెడ్డి, కళ్యాణ్, గోపాలపురం పొగాకు బోర్డు వేలం నిర్వాహణాధికారి టి హేమ స్మిత, రైతు సంఘం అధ్యక్షుడు పిన్నమనేని మధు మోహన్ పాల్గొన్నారు.

రాజేశ్వరీ రామకృష్ణన్ చిరస్మరణీయురాలు

కొవ్వూరు: ప్రముఖ పారిశ్రామికవేత్త రాజేశ్వరీ రామకృష్ణన్‌కు ఈ ప్రాంత రైతులతో మంచి అనుబంధం ఉందని వక్తలు అన్నారు. ఆమె సంతాప సభ గురువారం స్థానిక లిటరరీ క్లబ్ కల్యాణ మండపంలో నిర్వహించారు. పలువురు రైతు సంఘ నాయకులు, వివిధ పార్టీల నాయకులు ఆమె చిత్రపటానికి పూలు వేసి నివాళులు అర్పించారు. సీఎస్సార్ నిధులతో ఈ ప్రాంతంలో ఆమె పలు సేవా కార్యక్రమాలు నిర్వహించారని వక్తలు కొనియాడారు. ఆమె మృతికి తమ ప్రగాఢ సానుభూతిని, సంతాపాన్ని తెలిపారు. మాజీ ఎమ్మెల్సీ కోడూరి శివరామకృష్ణ, ఏబీఎన్ అండ్ పీఆర్ఆర్ కళాశాల ప్రిన్సిపాల్ ఎస్‌వీ సుబ్బారావు, టీడీపీ నియోజకవర్గ ద్విసభ్య కమిటీ సభ్యులు జొన్నలగడ్డ సుబ్బరాయ చౌదరి, కంఠమణి రామకృష్ణ, వైఎస్సార్ సీపీ నాయకులు పరిమి హరిచరణ్, ముళ్లపూడి కాశీ విశ్వనాథ్, పేరిచెర్ల బోసురాజు, లకంసాని సూర్యప్రకాశరావు, లిటరరీ క్లబ్ అధ్యక్షుడు పరిమి గెరటయ్య, డీసీసీ మాజీ అధ్యక్షుడు ఎండీ రఫీ యుల్లా బేగ్ తదితరులు పాల్గొన్నారు.

ఐదుగురిపై కేసు నమోదు

కొవ్వూరు: మండలంలోని ఆరికిరేవుల శివార్లలో అదే గ్రామానికి చెందిన పేరూరి సుబ్బారావును ఐదుగురు వ్యక్తులు దారి కాచి, ఆపి దుర్భాషలాడి, ఆపై కొట్టారు. ఈ విషయం తెలుసుకుని అక్కడకు చేరుకున్న సుబ్బారావు సోదరుడి కుమారుడైన శ్రీనివాసరావును కూడా వారు దుర్భాషలాడి చేయి చేసుకున్నారు. సుబ్బారావు స్వగ్రామం ఆరికిరేవుల అయినప్పటికీ అతడు కొవ్వూరులో నివాసం ఉంటున్నాడు. తన సొంతూరులో జరిగే క్రిస్మస్ వేడుకలకు ఈ నెల 27వ తేదీ రాత్రి అతడు వెళుతుండగా ఈ ఘటన జరిగింది. దీనిపై వారిద్దరూ ఇచ్చి ఫిర్యాదు మేరకు ఆరికిరేవులకే చెందిన కాకుల రాంబాబు, కాకుల దుర్గాప్రసాద్, కాసాని గణేష్, మారిశెట్టి చందు, కార్తీక్ అనే ఐదుగురిపై కేసు నమోదు చేసినట్టు కొవ్వూరూ పట్టణ ఎస్సై బి.దుర్గాప్రసాద్ గురువారం తెలిపారు.

నిత్యావసరాల పంపిణీ

నిడదవోలు: స్థానిక మానసిక దివ్యాంగుల ప్రత్యేక పాఠశాల (హృదయాలయం)కు రోటరీ క్లబ్ ఆఫ్ నిడదవోలు శాఖ గురువారం నిత్యావసరాలు, కిరణా సామాగ్రి అందజేసింది. ప్రవాస భారతీయుడైన చెన్నా శ్రీనివాస్ ఆర్థిక సహకారంతో ఆ క్లబ్ ఈ సేవా కార్యక్రమం నిర్వహించింది. క్లబ్ అధ్యక్షుడు కీర్తి ఆంజనేయులు, గొన్నాబత్తుల రామారావు, పొన్నా సుబ్రహ్మణ్యం, గోపిరెడ్డి శ్రీనివాస్, పోలదాసు శ్రీనివాసరావు తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

రబీ దమ్ములో జాగ్రత్తలు పాటించాలి

- జిల్లా వ్యవసాయ అధికారి మాధవరావు



పశివేదలలో రైతులకు సూచనలు చేస్తున్న జిల్లా వ్యవసాయ అధికారి మాధవరావు

కొవ్వూరు: జిల్లాలో రబీ దమ్ములు, వరి ఊడ్చే సమయంలో రైతులు తగిన జాగ్రత్తలు పాటించాలని జిల్లా వ్యవసాయ శాఖ అధికారి ఎస్.మాధవరావు సూచించారు. మండలంలోని పశివేదల, నందమూరు, దొమ్మేరు ప్రాంతంలో దమ్ము చేస్తున్న పంట పొలాలను గురువారం ఆయన పరిశీలించారు. రైతులతో మాట్లాడారు. జిల్లా వ్యాప్తంగా ఖరీఫ్ వరి కోతలు దాదాపు (98.2 శాతం) పూర్తి కావచ్చాయన్నారు. జిల్లాలో 70,826 హెక్టార్ల ఆయకట్టులో వరి సాగైతే ఇప్పటి వరకూ 69,582 హెక్టార్లలో కోతలు పూర్తయ్యాయన్నారు. ప్రస్తుతం జిల్లాలో రబీ వ్యవసాయ పనులు ముమ్మరంగా సాగుతున్నాయన్నారు. జిల్లా వ్యాప్తంగా 59,348 హెక్టార్ల సాధారణ సాగు విస్తీర్ణం ఉంటే ఇప్పటి వరకు 3,449 హెక్టార్లలో నాట్లు పడ్డాయన్నారు. సుమారు 2,800 హెక్టార్లలో నారుమళ్లు పోయాల్సి ఉండగా గురువారం సాయంత్రానికి 1,722 హెక్టార్లలో నారుమళ్లు పడ్డాయని వివరించారు. ఏడీఏ చంద్రశేఖర్, ఏవో గంగాధర్, పశివేదల మాజీ సర్పంచ్ పరిమి వెంకట్రావు, రైతులు పాల్గొన్నారు.

మాదక ద్రవ్యాలతో అనర్థాలపై అవగాహన

నిడదవోలు: మత్తు పదార్థాలు, మాదక ద్రవ్యాల వినియోగం వలన కలిగే అనర్థాలపై గురువారం పట్టణంలోని ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాల, ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలల విద్యార్థులకు ఎస్ఈబీ నిడదవోలు ఇన్‌స్పెక్టర్ కె.వీరబ్రహ్మం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయా కళాశాలల్లో యాంటీ డ్రగ్స్ కమిటీలను ఏర్పాటు చేశారు. ఆ కమిటీల సాయంతో విద్యార్థులకు నిరంతరం అవగాహన కల్పించాల్సిందిగా ఆయన కోరారు. ప్రిన్సిపాల్స్ టి.సుజాత, కేవీఆర్ మూర్తి, విద్యార్థులు, అధ్యాపకులు పాల్గొన్నారు.